పంచాయతీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కారోబార్ల సంఘం ప్రతినిధులు

భిక్కనూరు, డిసెంబర్ 23 : గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కారోబార్లు, బిల్ కలెక్టర్ల సమస్యలు పరిష్కరించాలని కారోబార్ల రాష్ట్ర కార్యవర్గ సంఘం కోశాధికారి యాదగిరి కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ సృజనను సంఘం ప్రతినిధిలతో కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో చేస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించి రెగ్యులర్ ఉద్యోగులుగా పరిగణించాలని కోరారు. కార్యక్రమంలో కారోబార్ల సంఘం ప్రతి నిధులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగమేళాకు విశేష స్పందన

ఉద్యోగ మేళాలో మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ గురువేందర్ రెడ్డి

కామారెడ్డి, డిసెంబర్ 23 : జిల్లా కేంద్రంలోని పీజేఆర్ స్పూర్తి డిగ్రీ కళాశాలలో టాస్క్ తెలంగాణ అకాడమీ స్కిల్స్ నాలెడ్జ్ ఆధ్వర్యంలో హెటిరో డ్రగ్స్ ఫార్మా కంపెనీ వారు సోమవారం ఉద్యోగమేళాను నిర్వహించారు. ఈ ఉద్యోగమేళాలో సుమారు 150 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ గురువేందర్ రెడ్డి మాట్లాడుతూ.. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకే ఉద్యోగమేళా నిర్వహించినట్లు తెలిపారు. ఇంటర్వ్యూలో 73 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, టాస్క్ రిలేషన్ ఆఫీసర్ శ్రీనాథ్‌రెడ్డి, హెటిరో డ్రగ్స్ సంస్థ ప్రతినిధి ప్రసాద్, ప్రోగ్రాం ఆఫీసర్ మహేశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ తాగునీటి కోసం ఫిర్యాదు

పెద్ద కొడప్‌గల్ ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న బేగంపూర్ గ్రామస్తులు

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేయాలని వినతిపత్రం అందజేస్తున్న ఆర్టీఐ ప్రతినిధి రవీందర్

నాగిరెడ్డిపేట/పెద్ద కొడప్‌గల్, డిసెంబర్ 23 : నాగిరెడ్డిపేట తహసీల్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ శ్రీనివాస్‌తోపాటు పలువురు అధికారులు ప్రజావాణిలో పాల్గొన్నారు. అధికారులతో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే వివరాలను ఎంపీడీవో ప్రభాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. సర్వే త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కాగా ప్రజావాణికి పూర్తి స్థాయిలో అధికారులు హాజరుకావడం లేదు. గ్రామాల నుంచి ప్రజలు సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు ఫిర్యాదులు చేస్తున్నారే తప్ప స్థానిక ప్రజావాణిలో ఫిర్యాదులు రావడం లేదు.

తాగునీరు రావడం లేదని..

పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో తాగునీరు రావడం లేదని ఫిర్యాదు వచ్చిందని తహసీల్దార్ దశరథ్ తెలిపారు. మండలంలోని బేగంపూర్‌లో 4వ వార్డు గ్రామ పంచాయతీ ఎదుట ఉన్న కుటుంబాలకు మిషన్ భగీరథ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు తాగునీరు రావడం లేదని, మండల పరిషత్ కార్యాలయంలోని సర్వసభ్య సమావేశంలో కూడా ఫిర్యాదు చేశామని, మిషన్ భగీరథ ఏఈ రచ్చప్ప, గ్రామ కార్యదర్శులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు.

పాఠశాల భవన నిర్మాణాన్ని నిలిపి వేయాలి..

బిచ్కుంద, డిసెంబర్ 23 : జుక్కల్ తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో పెద్దగుల్ల గ్రామంలో వేదవాహిణి పాఠశాల నూతన భవన నిర్మాణాన్ని నిలిపి వేయాలని సోమవారం ఎస్ఎఫ్ఐ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు షేక్ ఫిర్దోస్, కార్యదర్శి విలాస్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని వినతి

భిక్కనూరు, డిసెంబర్ 23 : మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సమాచార హక్కు చట్టం జిల్లా ప్రతి నిధి రవీందర్ కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో లబ్ధిదారులతో కలిసి వినతిపత్రం అందజేశారు. భిక్కనూరులో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు కేటాయించకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుతున్నాయని, వెంటనే వాటిని పంపిణీ చేయాలని కోరారు.

'ప్రజావాణి'కి ఫిర్యాదులు నిల్

లింగంపేట, డిసెంబర్ 23: లింగంపేట తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని తహసీల్దార్ నరేందర్‌గౌడ్ తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ట్రాన్స్‌కో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు రాలేదని ఏఈ సాయినాథ్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

హాజరుకాని అధికారులు..

ప్రతి సోమవారం తహసీల్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఆయా శాఖల అధికారులు హాజరుకావడం లేదు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించడానికి ఉన్నతాధికారులు మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీడీవో నరేశ్, వ్యవసాయ శాఖ అధికారి అనిల్‌కుమార్, మండల పంచాయతీ అధికారి మల్లూరీ, ఉపాధి హామీ పథకం, వైద్యశాఖ, తాగునీటి సరఫరా విభాగం అధికారులు హాజరయ్యారు. పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖ, అటవీశాఖ, విద్యాశాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, ఐసీడీఎస్ అధికారులు హాజరుకాలేక పోయారు. ఆయా శాఖల అధికారులు హాజరు కాకపోవడంతో గ్రామస్తుల నుంచి వచ్చే ఫిర్యాదులకు పరిష్కారం చూపే అధికారులు కరువయ్యారు. ఈ విషయమై తహసీల్దార్ నరేందర్‌గౌడ్‌ను వివరణ కోరగా.. ప్రజావాణికి హాజరుకాని అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఘనంగా రామానుజన్ జయంతి

బీబీపేట్, డిసెంబర్ 23 : మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని సోమవారం గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం విద్యార్థినులు 1729 అక్షర ఆకారంలో కూర్చున్నట్లు ప్రధానోపాధ్యాయులు రామేశ్వర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

1729 అక్షర ఆకారంలో కూర్చున విద్యార్థినులు

జిల్లా న్యాయవాద పరిషత్ కమిటీ ఎన్నిక

కామారెడ్డి, డిసెంబర్ 23 : జిల్లా న్యాయవాద పరిషత్ నూతన కమిటీని జిల్లా కేంద్రంలో సోమవారం ఎన్నుకున్నారు. రాష్ట్ర న్యాయవాద పరిషత్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారి మంగులాల్ ఆదేశాల మేరకు జిల్లా న్యాయవాద పరిషత్ అధ్యక్షుడిగా దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సంతోష్ శర్మ, కోశాధికారిగా గంగరాజు, ఉపాధ్యక్షులుగా సందీప్ రెడ్డి, మనోజ్ రాథోడ్, కార్యదర్శిగా భార్గవ్ చంద్రభూపాల్, యాదగిరిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు దామోదర్ రెడ్డి మాట్లాడుతూ.. న్యాయవాద సంక్షేమం, ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించడం కోసం న్యాయవాద పరిషత్ పనిచేస్తుందని తెలిపారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

మాచారెడ్డి, డిసెంబర్ 23 : మండలంలోని బంజపల్లి గ్రామానికి చెందిన బదావత్ వినోద్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు గ్రామస్తులు తెలిపారు. సీఎం కప్ పోటీల్లో జిల్లా స్థాయిలో సత్తాచాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడని, ఈ నెల 27 నుంచి జనవరి 2వ తేదీ వరకు ఖమ్మంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వినోద్‌ను అభినందించారు.

ఖోఖో పోటీలకు ఐదుగురు ఎంపిక

పాల్వంచలోని జడ్పీహెచ్ఎస్‌లో చదువుతున్న ఐదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో పాల్వంచ జడ్పీహెచ్ఎస్ రెండో స్థానం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

కొనసాగుతున్న ఇండ్ల సర్వే

బీబీపేట్, డిసెంబర్ 23 : బీబీపేట్, దోమకొండ మండల కేంద్రాలతోపాటు జనగామ, మాందాపూర్, యాడారం, తుజాల్‌పూర్, అంచనూర్, గొట్టిముక్కుల తదితర గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ఇండ్ల సర్వే కొనసాగుతున్నది. ఆయా గ్రామాల్లో సోమవారం ఇంటింటికీ తిరుగుతూ ఇండ్ల సర్వే చేసి వివరాలను నమోదు చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

గాంధారి మండలంలో..

గాంధారి, డిసెంబర్ 23: ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని గాంధారి ఎంపీడీవో రాజేశ్వర్ అన్నారు. మండలకేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఎంపీడీవో సోమవారం పరిశీలించారు. సర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు. సర్వే వివరాలను ఎప్పటికప్పుడూ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని గ్రామ కార్యదర్శులకు సూచించారు. మండలంలో ఇప్పటివరకూ దాదాపు 60 శాతం ఇండ్ల సర్వే పూర్తయినట్లు ఆయన తెలిపారు.

రైలు కింద పడి గుర్తుతెలియని మహిళ మృతి

రామారెడ్డి డిసెంబర్ 23 : మండలంలోని ఉప్పల్‌వాయి-కామారెడ్డి రైల్వే స్టేషన్ మధ్యలో గుర్తు తెలియని మహిళ రైలు కింద పడి సోమవారం మరణించింది. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతురాలు లేత ఆకుపచ్చ కలర్ చీర, పోక కలర్ జాకెట్, కాళ్లకు మట్టెలు, మెడలో దారంతో పుస్తెలతాడు ధరించి ఉంది. ఎవరికైనా తెలిసిన ఎస్సై సాయిరెడ్డి, నిజామాబాద్ సెల్ నంబర్ 8712658591ను సంప్రదించాలని రైల్వే పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

రామారెడ్డి, డిసెంబర్ 23 : అంత్యక్రియలకు వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన ఆదివారం మర్కల్ గ్రామం వద్ద చోటు చేసుకున్నది. సదాశివనగర్ ఎస్సై రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం .. సదాశివనగర్ మండలం జనగామ గ్రామానికి చెందిన చాకలి చిన్నరాజయ్య, చాకలి శివరాజవ్వ ఇద్దరూ వారి బంధువు మర్కల్ గ్రామంలో చనిపోవడంతో ఆదివారం అంత్యక్రియలకు హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో మర్కల్ జాతీయ రహదారిపై జంక్షన్ వద్ద అవతలి వైపు నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా, నిజామాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో చిన్నరాజయ్య(58) అక్కడికక్కడే మరణించాడు, శివరాజవ్వకు స్వల్ప గాయాలు కావడంతో ఆమెను కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పాఠశాలలో విద్యార్థులకు పోటీలు

విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఉపాధ్యాయులు

లింగంపేట, డిసెంబర్ 23: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం గణిత దినోత్సవం నిర్వహించారు. గణితశాస్త్ర కోవిదుడు శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, రంగోళి, ఉపన్యాసం, పాటలు పోటీలు నిర్వహించారు. అలాగే గణితం మాడుల్స్ ప్రదర్శించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శోభారాణి, గణిత ఉపాధ్యాయులు శైలజ, సరస్వతి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

పాస్‌పోర్ట్ పోయినది

★నేను కొంగబాబు తండ్రి కొంగరాజు, ఇ.నెం.10-132, ఆర్యనగర్, నిజామాబాద్, తెలంగాణ రాష్ట్రం నేను కంఠేశ్వర్ నుండి ఆర్యనగర్‌కు బైక్‌పై వస్తుండగా మార్గమధ్యలో నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు నెం.N4820507 Date of Issue 17-11-2015, Expiry Date: 16-11-2025 at Hyderabad ఎక్కడో పడిపోయినది. కావున దొరికిన వారు సంప్రదించండి సెల్: 6303062214

NTZ-338272

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నేడు 'రైతు నేస్తం'

లింగంపేట, డిసెంబర్ 23: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి అనిల్‌కుమార్ సోమవారం తెలిపారు. యాసంగిలో సాగు చేసే పంటలు, సస్యరక్షణ చర్యలు, వరి కుదుళ్లు కాల్చడం ద్వారా కలిగే నష్టాలపై వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు అవగాహన కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. బయోచార్ వినియోగంతో కలిగే లాభాలపై అవగాహన కల్పించనున్నట్లు ఆయన తెలిపారు.

ఎస్సైకి సన్మానం

లింగంపేట, డిసెంబర్ 23: లింగంపేట ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఎస్సై సుధాకర్‌ను బీజేపీ మండల నాయకులు సోమవారం సన్మానించారు. మండల పార్టీ అధ్యక్షుడు మాసుల శ్రీనివాస్ అధ్వర్యంలో నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఎస్సై సుధాకర్‌కు శాలువా కప్పి సన్మానం చేశారు. కార్యక్రమంలో నాయకులు దత్తురాం, ఎల్లేశం, కుమార్, రాంచందర్, క్రాంతికుమార్ తదితరులు ఉన్నారు.

వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 23: మండలంలోని అన్ని గ్రామాల్లో వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని గ్రామ కార్యదర్శులకు ఎంపీడీవో ప్రభాకర్ సూచించారు. సోమవారం మండ ల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులకు నిర్వహించిన స మావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెలాఖరు వరకు వంద శాతం పన్నులు వసూలు చేయాలన్నారు. విద్యుత్ బిల్లు బకాయిలు లేకుండా చూడాలని, ఇందిరమ్మ ఇండ్ల సర్వే వేగవంతం చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రభాకర్

1,015 ఎకరాలకు తైబందీ

ఇరిగేషన్ ఏఈకి నీటిని విడుదల చేయాలని వినతిపత్రం అందజేస్తున్న రైతులు

రామారెడ్డి, డిసెంబర్ 23 : సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డిలో సోమవారం అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువు యాసంగి వరి సాగు పంటకు ఇరిగేషన్ ఏఈ అనీశ్వర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ఇఫ్తాకర్, ఆరు గ్రామాల ఆయకట్టు రైతుల ఆధ్వర్యంలో 1,015 ఎకరాలకు తైబందీ పెట్టారు. త్వరలో స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుతో నీటిని విడుదల చేస్తారని రైతులు తెలిపారు. కార్యక్రమంలో అడ్లూర్ ఎల్లారెడ్డి మాజీ ఏంపీటీసీ లింగం, రైతులు పాల్గొన్నారు.

'మాదిగల మండే గుండె చప్పుడు' విజయవంతం చేయాలి

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 23: భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ అమలుకు ఇచ్చిన తీర్పును అమలుచేయకుండా కొందరు స్వార్థపరులు అడ్డుకుంటున్నారని, వారికి వ్యతిరేకంగా ఫిబ్రవరి 3వ తేదీన హైదరాబాద్‌లో లక్ష డప్పులతో 'మాదిగల మండే గుండెచప్పుడు' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా పర్యవేక్షకుడు మంథని సామ్యేల్ మాదిగ అన్నారు. సోమవారం ఎల్లారెడ్డిలోని మార్కెట్ కమిటీలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ డప్పులతో హైదరాబాద్‌కు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పద్మారావు, శివానంద, వెంకట్‌రాం, సత్తిగారి లక్ష్మి, సాయి, సాయిలు, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి అంబేద్కర్ చౌరస్తా వద్ద మాట్లాడుతున్న నాయకులు

14వ రోజుకు చేరిన సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

కామారెడ్డి, డిసెంబర్ 23 : జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె సోమవారానికి 14వ రోజుకు చేరుకుంది. ఉద్యోగులు మహాయజ్ఞం చేస్తూ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష ఉద్యోగులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరారు. ఏడాది గడుస్తున్నా ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని అన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు వాసంతి, నాయకులు సంపత్, రాములు, సంతోష్ రెడ్డి, శైలజ, కాళీదాసు, వీణ, సాయిలు, లావణ్య, సమగ్ర శిక్ష ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన గ్రూప్-4 ఉద్యోగులు

బాధ్యతలు స్వీకరిస్తున్న గ్రూప్-4 ఉద్యోగులు

బాన్సువాడ టౌన్, డిసెంబర్ 23 : గ్రూప్-4లో ఉత్తీర్ణత సాధించిన ఆరుగురు అభ్యర్థులు బాన్సువాడ మున్సిపాలిటీ అధికారులుగా సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. వీరిలో నలుగురు వార్డు అధికారులుగా, ఒకరు అకౌంటెంట్, ఒకరు క్లర్క్ గా నియమితులయ్యారు. వీరికి మున్సిపల్ చైర్మన్ గంగాధర్, మున్సిపల్ మేనేజర్ మల్లికార్జున్ బాధ్యతలు అప్పగించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బీబీపేట్, డిసెంబర్ 23 : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి దేవునిపల్లి శ్రీనివాస్ తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ బాధిత కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. ఆయన వెంట జడ్పీవైస్ మాజీ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్, గంగాధర్, నందకుమార్, ఆది రాజయ్య, రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, పొట్టయ్య, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

పెద్ద కొడప్‌గల్, డిసెంబర్ 23 : పిట్లం మండల కేంద్రంలోని రాజ రాజేశ్వర ఫంక్షన్ హాల్లో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు సోమవారం పాల్గొన్నారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుతూ ఘనంగా వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. క్రిస్మస్ పండుగను ప్రభుత్వం అధికారికంగా రాష్ట్రమంతా నిర్వహిస్తున్నదన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నూతన అంబులెన్స్ ప్రారంభం ..

పెద్ద కొడప్‌గల్, డిసెంబర్ 23 : మండల కేంద్రంలో సోమవారం జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు నూతన 108 అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు 108 అంబులెన్స్ అందుబాటులో ఉండాలని, దవాఖాన సిబ్బంది రోగులకు శక్తి మేర ఆరోగ్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నాయకులు మల్లప్ప పటేల్, హైమద్, నాగిరెడ్డి, మారుతి, సంజీవ్, నాగనాథ్, మొగులా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్ పోటీలు..

పెద్ద కొడప్‌గల్, డిసెంబర్ 23 : గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. కామారెడ్డిలో నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో పిట్లం మండల క్రీడాకారులు కబడ్డీ పోటీలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా సోమవారం మార్కెట్ యార్డులో క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ క్రిష్ణారెడ్డి, నాయకులు బోడ్ల రాజు, మోహన్‌రెడ్డి, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

పిట్లం క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు